క్లుప్తంగా

రోడ్డు పనులు త్వరలో పూర్తి చేస్తాం..

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: పార్వతీపురం – కొరాపుట్ రోడ్డు విస్తీర్ణ రహదారి పనులు త్వరలో పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రాజేంద్ర కుమార్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అడుగుకో గుంత' శీర్షికకు గురువారం ఆయన స్పందిస్తూ మాట్లాడారు. ఎస్‌హెచ్‌వో 85రోడ్డు విస్తీర్ణ, రహదారి పనులకు సంబంధించి రూ.17కోట్లు మంజూరైందని, అందులో భాగంగా కొంత మేర పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. అలాగే పెండింగ్ బిల్లులు కూడా రెండు రోజుల క్రితం చెల్లించినట్టు తెలిపారు. కొన్ని వారాల్లో మిగిలిన పనులను కాంట్రాక్టర్ ద్వారా చేయించి పూర్తి చేస్తామన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

సాలూరు: యువత సన్మార్గంలో నడవాలని ,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సబ్ డివిజన్ పోలీస్ అధికారి అంకితా సురానా అన్నారు. పట్టణంలో సత్యసాయి విద్యా సంస్థను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వలన కలిగే అనర్థాలను వివరించారు. క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ర్యాగింగ్, మహిళల చట్టాలు, శక్తి టీం సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


బాలకృష్ణ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని బిర్నకలవలస గిరిజన ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న కోట బాలకృష్ణ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పాలికవలసలో ఉదయం ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం, ఎమ్మార్‌నగరం, బందలుప్పి 11 కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరా జరుగుతున్నటువంటి గ్రామాలతో పాటు నర్సిపురం, వైకెఎం కాలనీ, వెంకంపేట, అఫీషియల్ కాలనీ, వసుంధర నగర్ తదితర ప్రాంతాలకు నర్సిపురం వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేసేందుకు పనులు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏఈ రామారావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైన తెలిపిన ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

20 లీటర్ల సారా స్వాధీనం


సీతంపేట: మండలంలోని పీపీ ఈతమానుగూడ ప్రాంతంలో తరలిస్తున్న 20 లీటర్ల సారాను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వై.అమ్మనరావు గురువారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, సవర బాలెమ్మ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

భవన నిర్మాణాల పరిశీలన


భవన నిర్మాణ ప్లాన్‌లు పరిశీలిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

పాలకొండ: నగరపంచాయతీలోని పలు భవనాలు, భవన నిర్మాణాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర గురువారం పరిశీలించారు. భవనాలకు కొలతలు వేసి కొలతల ప్రకారం నిర్మించారా..దానికి తగ్గట్టుగా పన్నులు చెల్లిస్తున్నారా అనే విషయం సరిచూశారు. నిబంధనల మేర పన్నులు చెల్లించని వారికి నోటీసులు అందివ్వాలని కమిషనర్ రత్నంరాజును ఆదేశించారు.

సమస్యలను పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దారు కామేశ్వరరావు

వీరఘట్టం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దారు ఎ.ఎస్.కామేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో గురువారం సమావేశమైన ఆయన..సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు కె.కవిత, వీఆర్వోలు వి.రమేష్‌నాయుడు, కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఇంటింట జ్వరపీడితులు
- వైద్య శిబిరం సేవలు అంతంతమాత్రమే..


మంచం పట్టిన బోను అన్నపూర్ణమ్మ

సీతానగరం:

మండలంలోని లక్ష్మీపురంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో జ్వర పీడితులు ఉన్నారు. దీంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలో గడిచిన పది రోజులుగా ఈ జ్వరాలు ప్రబలుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అధిక జ్వరం, కీళ్ల నొప్పులు, ఆయాసం, దగ్గు, దురదలతో జ్వర పీడితులు బాధపడుతున్నారు. అయినా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి చెందిన బి.రామినాయుడు, గవర కృష్ణ, బోను చిన్నంనాయుడు, బోను భవాని, ఒమ్మి పద్మ, గవర గౌరమ్మ, సాసుబిల్లి శాంతమ్మ, వి.రేవతి, పి.అప్పలనాయుడు, ఎస్.రామినాయుడు తదితరులు


జ్వర పీడితులను పరీక్షిస్తున్న డాక్టర్ రమ్యసాయి

బొబ్బిలి, పార్వతీపురం ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.వేలు ఖర్చు పెట్టి చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు గ్రామంలో రామమందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. ఇక్కడ జ్వరాలు తగ్గని రోగులు సీతానగరం మెడికల్ షాపుల వద్ద, ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

గ్రామంలో పారిశుధ్య లోపం

గ్రామంలో ప్రధానంగా కాలనీలోని బీటీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువల్లో నీరు నిల్వ ఉండిపోవడం, దోమలకు నిలయంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విజృంభణతోనే జ్వరాలు ప్రబలుతున్నాయని చెబుతున్నారు. వీధులన్నీ బురదమయం కావడంతో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.


కాలనీ వీధుల్లో పారిశుధ్య లోపం

కీళ్ల నొప్పులు, వాపులతో అవస్థలు



వారం రోజుల క్రితం జ్వరం వచ్చింది. స్థానికంగా ప్రభుత్వం ఇచ్చిన మందులు వాడినా తగ్గడంలేదు. పార్వతీపురం ప్రైవేటు ఆసుపత్రిలో రూ.వేలు పెట్టి చికిత్స పొందాను. అయినా కీళ్ల నొప్పులు తగ్గడం లేదు. నడవలేక పోతున్నాను. శరీరంపై దురదలు నిండా ఉన్నాయి. తక్షణమే ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందించి ఆదుకోవాలి.

– బి.భవానీ, లక్ష్మీపురం

ఫలితం లేదు..



పది రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నాను. దోమలు కుట్టడం వలనే జ్వరాల బారిన పడుతున్నాం. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయించడంతో డబ్బుల ఖర్చు తప్పడం లేదు.వ్యాధులు తగ్గడం లేదు. మూడు పర్యాయాలు తిరిగినా ప్రయోజనం లేదు. తక్షణమే స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించి ఆదుకోవాలి.

– బి.రామినాయుడు, లక్ష్మీపురం

అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా కొత్తవారు సంచరించినా, అనుమానం వస్తే పోలీసులకు సమాచారాన్ని ఇచ్చి అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ బి.సంతోషి కుమారి అన్నారు. అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చునని తెలిపారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో ప్రజలకు దొంగతనాలు, సైబర్ నేరాలు జరిగే తీరుపై గురువారం అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వారిపై అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల్లో పీఎం కిసాన్, ముద్రా రుణాలు, వర్క్‌ఫ్రం హోం ఉద్యోగ అవకాశాలు అంటూ ఆశ చూపి ఎరవేసేందుకు సైబర్ నేరగాళ్లు పన్నాగాలు పన్నుతున్నట్టు ఆమె తెలిపారు. తమ వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఫోన్ ద్వారా గుర్తు తెలియని వారు ఎవరైనా అడిగితే తెలిపేందుకు నిరాకరించాలన్నారు. అనంతరం రూరల్ పరిధిలో వున్న అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలు తనిఖీలు చేపట్టారు.

వైద్య శిబిరం సందర్శన

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో గురువారం నిర్వహించిన 104 సంచార వైద్య శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి పీఎల్ రఘు ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు నిర్వహిస్తున్న వైద్య తనిఖీలతో పాటు చికిత్సను పరిశీలించారు. జ్వరాలు ప్రబలే అవకాశం ఉండడంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి జ్వర లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించాలని స్పష్టం చేశారు. వాహనంలో ఉండే ఈసీజీ యంత్రం పనితీరుతో పాటు మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. రోగుల తనిఖీలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు కూడా నెలవారీ క్రమం తప్పకుండా చేయాలని ఆదేశించారు. సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.ఉషారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• మోకాళ్లపై నిరసన



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు,, వసతిగృహాల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మోకాళ్లపై వినూత్నంగా నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో పాల్గొన్న గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మొదటి సంతకానికి విలువనిచ్చి తక్షణమే ఏఎన్‌ఎంలను నియమించాలన్నారు. సంఘ నాయకులు పల్లి సురేష్, ఆరిక చంద్రశేఖర్, హెల్త్ వాలంటీర్‌లు పాల్గొన్నారు. – పార్వతీపురం

గట్లపై కొబ్బరి మొక్కలు నాటి సంరక్షించాలి

సీతానగరం: మండలంలో చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు వేతనదారులు, పంచాయతీ పాలకులు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలోని 27 గ్రామాలకు సంబంధించిన చెరువుల గట్లపై కొబ్బరి మొక్కలు నాటడానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 9560 కొబ్బరి మొక్కలు గురువారం పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిర్వాహకులంతా కొబ్బరి మొక్కలు చెరువుగట్లపై నాటిన అనంతరం ఫలసాయం వచ్చే వరకూ సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీవో బాలకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో సమకూర్చిన కొబ్బరి మొక్కలను ఏపుగా పెరిగే వరకు వేతనదారులు సంక్షించుకోవాలని కోరారు. కొబ్బరి మొక్కలను ఇంజినీరింగ్ అధికారి సోమేశ్వరరావు పర్యవేక్షణలో టెక్నికల్ సహాయకులు ద్వారా క్షేత్ర సహాయకులు పంపిణీ చేసినట్టు చెప్పారు.


కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

సాలూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో శానిటరీ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం తప్పకుండా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. ప్రతి నివాసిత ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రజలకు అవగాహన పెంపొందించాలని అన్నారు. పట్టణంలో ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు.

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

సీతానగరం: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవగా ఇప్పటికీ మోసపూరితంగా వ్యవహరించడం సరికాదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పాపమ్మవలసలో మాజీ సర్పంచ్ ఆర్.జగదీష్, మండల పార్టీ నాయకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఇప్పలవలసలో ఎంపీటీసీ జి.సంతోషికుమార్, సర్పంచ్ సీహెచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు బి.శంకరరావు, ఎం.మన్మధరావు, బి.తిరుపతిరావు, ముకుందరావు, కె.శ్రీనివాసరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• గిరిజనుల ఆందోళన



తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని జియ్యమ్మవలస మండలంలోని ఏనుగులగూడ, గడసింగపురం గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు పలు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వీరఘట్టం తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. వీరఘట్టం మండలంలోని చిన్నగోర రెవెన్యూ పరిధిలో లక్ష్మీదేవి కొండ, రాళ్లగెడ్డ పక్కన ఉన్న 25 ఎకరాల భూమిని గత 20 ఏళ్లుగా సాగు చేసుకుని బతుకుతున్నామని, అయితే ఆ భూములు తమవని వీరఘట్టం మండలంలోని సంత–నర్సిపురానికి చెందిన కొంతమంది తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమపై దాడి కూడా చేశారని, వాపోయారు. దాడికి ఎగబడిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ భూములకు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు ఎ.ఎస్.కామేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి.రమణారావు, పి.భాస్కరరావు, ఎన్.సింహాచలం, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

–వీరఘట్టం

సూపర్ సిక్స్ పేరిట చంద్రబాబు మోసం

• మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు


బలిజిపేట: చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, నాయకులు


బలిజిపేట: తుమరాడలో వైఎస్సార్‌సీపీ ర్యాలీ

బలిజిపేట: కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ – సంక్షేమ పాలన పేరిట చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ధ్వజమెత్తారు. మండలంలోని తుమరాడలో చంద్రబాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం లేదు, అభివృద్ధి లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం దాటినా సంక్షేమ పథకాలు లేవని, అభివృద్ధి జరగలేదన్నారు. రైతులను నిలువునా ముంచారని, ఆడబిడ్డలను రోడ్డున పడేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచక పాలనే కనిపిస్తోందన్నారు. రెడ్‌బుక్ పేరిట అక్రమ కేసులతో పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. వాలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని పూర్తిగా ఆ వ్యవస్థే లేకుండా చేశారన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ అంటూ మోసం చేశారన్నారు. మహిళలకు ఆర్థిక సాయం లేదు, నిరుద్యోగులకు ఉద్యోగాల్లేవు, నిరుద్యోగ భృతి లేదన్నారు. ఇప్పుడేమో ఆడబిడ్డ నిధి కోసం రాష్ట్రాన్ని అమ్మేయాలంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కక్ష సాధింపులతో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం తప్ప సాధించేదేమి లేదన్నారు. చంద్రబాబు వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో కె.శ్రీరామూర్తి, తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిఎస్ఆర్.నాయుడు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి టి.ప్రసాదరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం డైరెక్టర్ వాసుదేవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అని ప్రజల గొంతు కోశారు

పార్వతీపురం రూరల్: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో సూపర్ సిక్స్ అని ప్రచారం చేసి ప్రజల గొంతు కోశారని పార్వతీపురం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపు మేరకు 3వ వార్డు వివేకానంద కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వార్డులో ర్యాలీ నిర్వహించి అనంతరం గడప గడపకు వెళ్లి ఇంటింటికి వంచన కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ , మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, పలు వార్డుల కౌన్సిలర్లు లావణ్య, త్రినాథ, అనుబంధ విభాగాల నాయకులు నాగరాజు, గండి భాగ్యలక్ష్మి, గొర్లి మాధవ, నేతాజి, మరికొంతమంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధాలే చంద్రబాబు పెట్టుబడి

మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడి కూటమి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు బి.రవికుమార్, సిద్దా జగన్నాథం, మజ్జి శేఖర్, బంకపల్లి వాసు, బడే రామారావు, చందాన శివాజీ, మడక విశ్వనాథం, పెండ రమణమూర్తితో పాటు మరికొందరు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పార్వతీపురం రూరల్: పెదబొండపల్లిలో వంచన కరపత్రాన్ని, అందజేస్తున్న మండల నాయకులు

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు


మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ డీఈ వెంకటరావు

గుమ్మలక్ష్మీపురం: పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నట్లు గృహ నిర్మాణ శాఖ డీఈ ఎం.వెంకటరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆ శాఖ ఏఈ, వర్క్ఇన్‌స్పెక్టర్లతో గురువారం సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కురుపాం సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో పీఎం జన్‌మన్ గృహాలు 2,774 మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు కేటాయించడం జరిగిందని, పనులు చేపట్టిన తక్షణమే బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో పీఎంఏవై గ్రామీణ పథకం ద్వారా 3,761 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 1632 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగతావి ఆయా వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణాల పూర్తికి కూడా సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గుమ్మలక్ష్మీపురం ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.